

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

పాలకొండ/కురుపాం: పాలకొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనె 2, 3 తేదీల్లో ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ కూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్వో శుభం బన్సల్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. కురుపాంలోనూ పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు, ఆర్వో వీవీ రమణ ఆధ్వర్యంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు.

ఐదేళ్లూ.. పట్టించుకోలే!




నిర్వాసిత గ్రామం బాసంగి

- నిర్వాసిత గ్రామాల్లో సమస్యలపై స్పందించని సీఎం జగన్
- ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించని ప్రభుత్వం
- కొంతమందికి పరిహారం కూడా అందించని వైనం
- న్యాయం చేయని వైసీపీ తీరుపై ఆయా ప్రాంతవాసుల మండిపాటు

(జియ్యమ్మవలస)

'నేనున్నాను.. నేను విన్నాను.. అధికారంలోకి రాగానే అందరి సమస్యలు పరిష్కరిస్తాం' అని పాదయాత్ర సమయంలో జగన్‌హామీ ఇచ్చారు. ఇది నిజమే అనుకుని జిల్లావాసులు గత ఎన్నికల్లో వైసీపీకి పట్టం కట్టారు. అయితే అధికారంలోకి వచ్చిన జగన్ జిల్లాలో నిర్వాసిత గ్రామాలపై మాత్రం దృష్టి సారించలేదు. అక్కడి సమస్యలను పట్టించుకోలేదు. ప్రాజెక్టుల కోసం సర్వం త్యాగం చేసిన వారిని గుర్తించలేదు. ఐదేళ్లు గడిచినా.. నిర్వాసితులకు తగిన న్యాయం చేయలేదు.

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిధి తోటపల్లి బ్యారేజీ ముంపు ప్రాంతంలో 2004-05లో జియ్యమ్మవలస మండలం బాసంగి, బిత్రపాడు, కొమరాడ మండలంలోని నిమ్మలపాడును నిర్వాసిత గ్రామాలుగా గుర్తించారు. బిత్రపాడు పంచాయతీలో బిత్రపాడు, బట్లభద్ర, సీమనాయుడువలస, బాసంగి పంచాయతీలో బాసంగి బాసంగి గదబవలస, ఎం.హరిపురం గ్రామాలు ఉన్నాయి. బిత్రపాడు పంచాయతీ సీమనాయుడువలస కూడలి వద్ద బిత్రపాడు, బట్లభద్ర, కొమరాడ మండలం నిమ్మలపాడు గ్రామాలకు స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. ప్యాకేజీ కూడా అందజేశారు. అయితే వీరిలో కొందరికి ప్యాకేజీ అందలేదని చెబుతున్నారు. బిత్రపాడు, బట్లభద్ర గ్రామాలకు ఇచ్చిన స్థలాలు చాలా లోతుగా ఉండేవి. ఈ విషయాన్ని అప్పటి విజయనగరం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే.. ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. చదును చేయడానికి అయ్యే ఖర్చు ఇస్తామని చెప్పారు. దీంతో నిర్వాసితులే వారికిచ్చిన స్థలాలను సొంత డబ్బులతో చదును చేసుకొని ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఇప్పటికీ ఒక్క పైసా కూడా ఇవ్వలేదని వారు వాపోతున్నారు. చర్చిలు, దేవాలయాల నిర్మాణానికి కూడా నిధులు ఇవ్వలేదని చెబుతున్నారు. కొమరాడ మండలంలో నిర్వాసిత గ్రామం నిమ్మలపాడులో 40 మంది ఇళ్లు నిర్మించుకున్నా డబ్బులు ఇవ్వలేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు.

బాసంగిలో ఇలా..

తోటపల్లి నిర్వాసిత గ్రామాల్లో బాసంగి పంచాయతీ చాలా దయనీయ స్థితిలో ఉంది. ఈ గ్రామంలో మొత్తం 384 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. 2007లో వీరికి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, భూములకు నష్ట పరిహారం ప్రభుత్వం అందించింది. కానీ ఇళ్ల మంజూరు విషయంలో మాత్రం న్యాయం చేయలేదు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వారి కోసం సీమనాయుడువలస గ్రామ సమీపంలో బట్లభద్ర రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 63, 65, 67/2, 69/22, 71, 72లలో 30.58 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇక్కడ అవసరమైన సీసీ రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా ఏర్పాటు చేశారు. అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఎంఎం నాయక్ ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న 384 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకున్నారు. వీరిలో కొందరు తమ పంట భూములకు ఇళ్ల స్థలాలు చాలా దూరంగా ఉన్నాయని పట్టాలు తీసుకునేందుకు నిరాకరించారు. 252 మంది మాత్రమే ఇళ్ల పట్టాలు తీసుకొని ఇళ్లు నిర్మించుకొనేందుకు సిద్ధమయ్యారు. కానీ ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇళ్ల మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సీమనాయుడువలస వద్ద బాసంగి నిర్వాసితులకు కేటాయించిన స్థలం ఇదే..

ఇవీ సమస్యలు..

- బాసంగి నిర్వాసిత గ్రామంలో 70 మందికి ఇంకా అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు.
- బట్లభద్ర రెవెన్యూ పరిధిలో కేటాయించిన స్థలాలకు వెళ్లిపోతామని 252 మంది ఇళ్ల పట్టాలు తీసుకున్నా.. వారికి గృహాలు మంజూరు చేయలేదు.
- ప్రైవేట్ స్థలంలో గృహాలు నిర్మించుకుంటామన్న వారికి కూడా నిధులు మంజూరు చేయలేదని మరికొందరు వాపోతున్నారు.
- దేవాలయాలు, చర్చిలు నిర్మాణాలకు ఒక్క పైసా ఇవ్వలేదు.
- గ్రామంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నారని తేల్చి ప్యాకేజీ ఇవ్వలేదు.
- 2021లో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శ్రీధర్‌బాబు ఈ గ్రామానికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కానీ నేటికీ సమస్యలు పరిష్కారించలేదు.
- కొన్ని కుటుంబాలు చింతలబెలగాం రెవెన్యూ పరిధిలో 14 ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ గ్రామానికి సమీపంలో తూర్పు వైపు మరికొందరు, పెదమేరంగి కూడలిలో మరికొందరు, గవరమ్మపేట వద్ద ఇంకొందరు ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

మరికొన్ని నిర్వాసిత గ్రామాల్లో ఇలా..

- తోటపల్లి బ్యారేజీ ముంపు గ్రామాలు ఏడు వరకు ఉన్నాయి. అయితే ఆయా గ్రామాల ప్రజలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు.
- పీఆర్‌ఎస్ వలస, సుంకి, బాసంగి, బాసంగి గదబవలస, తదితర నిర్వాసిత గ్రామాల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు.
- బాసంగి గదబవలస, గుణానుపురం, పిన్నింటిరామినాయుడువలసలలో గల దాదాపు 20 నుంచి 30 గిరిజన కుటుంబాలకు చెందిన 20 ఎకరాల డిపట్టా భూములకు ఇంతవరకు నష్ట పరిహారం ఇవ్వలేదు.
- బంటువాని వలసలో 18 ఏళ్లు నిండిన 32 మంది యువకుల ఇళ్ల పట్టాలకు సంబంధించి స్థలం చూపించలేకపోయారు.
- దేవాలయాలకు, చర్చిల నిర్మాణాలకు పరిహారం చెల్లించలేదు.
- విజయనగరం జిల్లాలో రామతీర్థసాగర్, పార్వతీపురం మన్యం జిల్లాలో పెద్దగెడ్డ నిర్వాసితుల సమస్యలు ఇంతవరకు పరిష్కారం చూపలేదు.
- తోటపల్లి నిర్వాసిత ఆరేడు గ్రామాల్లో 2,800 నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు వ్యయం ఎంత అనేది ఇంతవరకు వైసీపీ ప్రభుత్వం నిర్ధారించలేకపోయింది.

వైసీపీ సర్కారు విఫలం..

నిర్వాసిత గ్రామాల సమస్యల పరిష్కారం విషయంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నిర్వాసితులకు న్యాయం చేయాలని పలుమార్లు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించాం. అయినా ఎటువంటి చర్యలు లేవు. రోజుల్లో తీవ్రంగా ఉద్యమిస్తాం.

-బంటు దాసు, నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

ఉన్నతాధికారులకు నివేదించాం..

జియ్యమ్మవలస మండలంలో నిర్వాసిత గ్రామాల సమస్యలు పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులకు నివేదించాం. వారి నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాల్సి ఉంది. ఆ తరువాత సమస్యలను పరిష్కారిస్తాం.

-డీవీ సీతారామయ్య, తహసీల్దార్, జియ్యమ్మవలస

నిబంధనలు ఉల్లంఘించిన

వలంటీర్‌పై వేటు

పార్వతీపురం టౌన్, మే 1 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన జిల్లాకేంద్రంలోని ఓ వలంటీర్‌పై వేటు పడింది. విధుల నుంచి తొలగిస్తూ.. ఈ మేరకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం పార్వతీపురంలోని బెలగాం 18వ వార్డులో వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుచరులతో ప్రచారం నిర్వహించారు. ఆ వార్డులోని కోవెల వీధిలో నివాసముంటున్న 10వ సచివాలయ పరిధి 19వ వార్డు వలంటీర్ గొట్టా మాధవి అత్యుత్సాహం చూపారు. తాను వలంటీర్‌నని మరిచిపోయి ఎన్నిక నియమావళికి వ్యతిరేకంగా టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్‌కు పూలమాల వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీనిపై కొంతమంది వ్యక్తులు వాట్సప్ ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమలతకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు ఎన్నికల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు సమగ్ర విచారణ జరిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వార్డు వలంటీర్ ప్రవర్తించినట్లు ధ్రువీకరించారు. ఆర్వో ఆదేశాల మేరకు వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నేడు పాలకొండకు పవన్

పాలకొండ: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గురువారం మధ్యాహ్నం పాలకొండలో పర్యటించనున్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించనున్నారు. నేరుగా ఆయన విశాఖ నుంచి పాలకొండకు రానున్నారు. గజాల ఖానా సమీపంలో హెలీప్యాడ్ వద్ద దిగి ప్రధాన రహదారి మీదుగా వడమ కూడలి వరకు ప్రచార ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ జరగనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కాగా పవన్ పర్యటన విజయవంతం కోసం కూటమి నాయకులు, కార్యకర్తలు అన్ని ఏర్పాట్లు చేశారు. జనసేన పాలకొండ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, బీజేపీ అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత తదితరులు పాల్గొనున్నారు.


పవన్ పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ



హెలీప్యాడ్‌ను పరిశీలించిన ఏఎస్పీ

పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పాలకొండ-వీరఘట్టం రోడ్డులోని గజాల ఖానా సమీపంలో హెలీప్యాడ్‌ను బుధవారం ఏఎస్పీ దిలీప్‌కిరణ్ పరిశీలించారు. వడమ సెంటర్‌లో బహిరంగ సభ ప్రదేశాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట డీఎస్పీ జీవీ కృష్ణారావు, ట్రైనీ డీఎస్పీ అజీజ్, సీఐ చంద్రమౌళి తదితరులున్నారు.

జిల్లాకేంద్రానికి కేంద్ర మంత్రి

నితిన్ గడ్కరీ రాక..

పార్వతీపురం, మే1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా కేంద్రానికి గురువారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హెలీకాప్టర్‌లో విశాఖ నుంచి ఆయన ఇక్కడకు వస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఉదయం 11:20 గంటలకు పార్వతీపురం చేరుకోనున్న కేంద్ర మంత్రి బహిరంగ సభలో పాల్గొంటారు. 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సభలో ప్రసంగించనున్నారు. అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనున్నారు.

ఘనంగా మే డే


పార్వతీపురంలో బైక్ ర్యాలీ చేస్తున్న వర్తక కళాసీ సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్, మే1 : జిల్లాలో కార్మికులు ఘనంగా మే డే వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాడవాడలా జెండాలు ఎగురవేసి.. కార్మిక పోరాటాల్లో అమరులైన వారికి నివాళి అర్పించారు. అనంతరం వారి సేవలను గుర్తుచేసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరా టాలే శరణ్య మని తెలియజేశారు. బుధవారం కురుపాం, పాలకొండలోనూ కార్మిక సంఘ నాయకులు మే డే వేడుకలు నిర్వహించారు. ఇక జిల్లాకేంద్రంలో పాత బస్టాండ్, నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద సీఐటీయూ, వర్తక కళాశీ సంఘాలు మే డేను నిర్వహించారు. తమ సంఘాల పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం వర్తక కళాసీ సంఘ కార్మికులంతా ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఇఫ్టూ నాయకులు రమణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ శక్తులపై పోరాటం

సాలూరు: దోపిడీ శక్తులపై ఐక్య పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధపడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.అజయ్‌శర్మ పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పీఎం మోదీ పెట్టుబడిదారీ వర్గాలకు వరాలు కురిపించారని ఆరోపించారు. కార్మికులు 12 గంటల పాటు పనిచేసేలా చట్టాల్లో మార్పు తేవాలని ప్రయత్నించగా.. కొన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు.

సమస్యాత్మక

పోలింగ్ కేంద్రాలపై నిఘా

- ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ నయీం ముస్తఫా మన్సూరీ

జియ్యమ్మవలస/కురుపాం, మే 1 : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై నిఘా పెంచాలని ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ నయీం ముస్తఫా మన్సూరీ ఆదేశించారు. బుధవారం ఆయన జియ్యమ్మవలస మండలంలో చినకుదమ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని పూర్తి పరిశీలించి.. సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట చినమేరంగి సీఐ బి.మంగరాజు, ఎస్ఐలు ఇ.చిన్నంనాయుడు, సింహాచలం తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. మూలిగూడ వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టునూ సందర్శించారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.


కురుపాంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల పోలీస్ పరిశీలకుడు

హోం ఓటింగ్‌కు 167 దరఖాస్తులు

- ఆర్వో విష్ణుచరణ్ వెల్లడి

సాలూరు, మే 1: ఇంటి నుంచి ఓటు వేసేందుకు (హోం ఓటింగ్) గాను సాలూరు నియోజకవర్గంలో 167 మంది వృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారని ఆర్వో విష్ణుచరణ్ తెలిపారు. వారికి ఈ నెల మూడో తేదీ నుంచి ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులకు అంగన్‌వాడీలకు హాజరుకావల్సి ఉంటుందన్నారు. అయితే వారిలో గర్భిణులు, బాలింతలు, కేన్సర్ రోగులు, ఇతర ఇబ్బందులున్న వారు కలెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో విష్ణుచరణ్

నేడు విజయనగరానికి బాలకృష్ణ



విజయనగరం, మే 1(ఆంధ్రజ్యోతి)/ చీపురుపల్లి: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం విజయనగరం జిల్లా చీపురుపల్లికి చేరుకుంటారు. ఇదే రోజు సాయంత్రం విజయనగరంలో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. గంటస్తంభం కూడలిలో రోడ్డు షో ఉంటుంది. చీపురుపల్లిలో సాయంత్రం 4గంటల వరకు ప్రచారం కొనసాగించి అపై విజయనగరం చేరుకుంటారు. నీళ్లట్యాంక్, అంబటి సత్రం, మూడు లాంతర్ల రోడ్డు మీదుగా గంట స్తంభం కూడలికి చేరుకుంటారు.

మద్యం షాపులకు సీసీ కెమెరాలు

విజయనగరం క్రైమ్, మే 1: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని 149 ప్రభుత్వ మద్యం షాపులు, 28 బార్ అండ్ రెస్టారెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎన్‌వీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సరఫరా చేస్తున్న వాహనాలకు కూడా జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. మద్యం డిపోలో సీసీ కెమెరాలు కలెక్టర్ కార్యాలయంలోని ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌కు, మద్యం షాపులు, బార్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు విజయవాడలోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఎన్నికల కమిషన్ కార్యాలయానికి అనుసంధానం అయినట్లు పేర్కొన్నారు.

రహదారిపై ఏనుగుల హల్‌చల్

కొమరాడ, మే 1 : కొమరాడ మండలంలో సీమనాయుడువలస జంక్షన్-కెమిశీల గ్రామ రహదారిపై బుధవారం ఏడు ఏనుగులు హల్‌చల్ చేశాయి. ఒక్కసారిగా అవి రోడ్డుపైకి రావడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు భయభ్రాంతులకు గురయ్యారు. వాహన చోదకులు, పాదచారులు బెంబేలెత్తిపోయారు. మొత్తంగా ఆ రహదారిలో సుమారు గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని ఏనుగులను సమీప పొలాల్లోకి తరలించారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత యథావిధిగా రాకపోకలు సాగించారు. కొద్ది రోజులుగా దళాయిపేట, మాదలంగి, తొడుము, వన్నాం, పాలెం, పూజారిగూడ గ్రామ పరిసరాల్లో గజరాజులు సంచరిస్తుండడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


కెమిశీల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

పీపుల్స్ మేనిఫెస్టో

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సాలూరు రూరల్: వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. కొందరిని మాత్రమే ఇటీవల రెగ్యులర్ చేశారు. ఎప్పటి నుంచో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న చాలా మందికి నిరాశ ఎదురయ్యింది. ఎన్నికల అనంతరం ఏ ప్రభుత్వం వచ్చినా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. ఉద్యోగ భద్రత లేకపోవడంతో భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలి.

- ఎం.శేఖర్, కాంట్రాక్ట్ ఉద్యోగి, మామిడిపల్లి

బూత్ కాప్చరింగ్‌కు పాల్పడ్డారో జైలే

మీకు తెలుసా?



విజయనగరం: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ కాప్చరింగ్ అంటారు. ఎవరైనా కావాలని బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలను పాడు చేయడం, విరగ గొట్టడం ఎన్నికల గుర్తులపై సిరా పోయడం వంటివి ఇందులో భాగమే. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్ అడ్డుకోవడం నేరం. ఇలాచేసే ప్రభుత్వ సిబ్బంది అయితే ఐపీసీ 1951 సెక్షన్ 135 ఏ, 136 ప్రకారం మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలుతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులైతే ఒకటి నుంచి మూడు సంవత్సరాల జైలు శిక్ష వేస్తారు.

మంచోళ్లకు ఓటు వేసేవాళ్లం

పెద్దల మాట



భోగాపురం: అప్పట్లో మంచోళ్లకు ఓటు వేసేవాళ్లం. గతంలో బంధుత్వాలతో పిలుస్తూ చెట్ల కింద, రచ్చబండల వద్ద గుంపుగా కూర్చోబెట్టి... పెద్దోళ్లు వచ్చి ఓటు వేయాలని అడిగేవారు. ఇప్పుడు నాయకులు చెబుతున్న విధంగా జరగడం లేదు. అలాగే ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే ఓటు వేస్తున్నారు. గతంలో కాగితాలపై ముద్ర గుద్ది ఆ కాగితాన్ని మడిచి డబ్బాల్లో వేసేవారిమి. ఇప్పుడు బటన్ నొక్కి ఓటేయాలంటున్నారు. ఏది నొక్కుతామో మాకేటి తెలుస్తుంది.? నాకు చంద్రబాబు అంటే ఇష్టం. మా గ్రామంలో నలుగురూ (అందరూ) దేనికి వేస్తే నేను దానికే ఓటు వేస్తాను. నాయకుడు ఉపయోగపడే విధంగా ఉండాలి.

- లక్కోజు చిన్నమ్మడు (75), ఎ.రాయవలస, భోగాపురం మండలం

● సకుటుంబ సపరివార సమేతంగా జనంలోకి ● తలోదిక్కుకు పరుగులు తీస్తున్న అభ్యర్థులు, బంధువులు

పదండి పోదాం ప్రచారానికి..

... శృంగవరపుకోట శాసనసభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరుపున నాలుగోసారి పోటీ చేస్తున్న కోళ్ల లలిత కుమారిని గెలిపించేందుకు భర్త బుచ్చి అప్పల రామప్రసాద్, కుమార్తె హసితనాయుడు, చెల్లెలు ఉష తదితర కుటుంబ సభ్యులంతా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఇంటింటికి తిరిగేస్తున్నారు. కనిపించిన వారందరినీ ఓట్లడుగుతున్నారు. తమ కుటుంబానికి ఉన్న రాజకీయ చరిత్రను వివరిస్తున్నారు.

... వైసీపీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు భార్య డాక్టర్ మధు ఎన్నికల ప్రచార రంగంలోకి దూకారు. తన భర్తను గెలిపించుకోనేందుకు అమెరికా నుంచి ఇక్కడ వాలిపోయారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ కడుబండిని గెలిపించాలని కోరుతున్నారు.

(శృంగవరపుకోట)

...ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీతో పాటు ఇతర పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులు సపరివార సమేతంగా ఎన్నికల ప్రచారాల్లో మునిగి తేలుతున్నారు. నామినేషన్ల ఉప సంహరణ ఘట్టం ముగిసింది. సార్వత్రిక ఎన్నికల రణరంగంలో పోటీపడే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లాలో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. 77 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గంలోనూ 15 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఆరు విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తాయి. శృంగవరపుకోట మాత్రం విశాఖపట్నం పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తుంది. ఇక్కడ వచ్చే మెజార్టీని బట్టి విశాఖ పార్లమెంటు అభ్యర్థి గెలుపు... ఓటములు ఆధారపడి ఉంటాయి. దీంతో టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, వైసీపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీలు ప్రత్యేకంగా ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. కుటుంబ సభ్యులను కూడా ప్రచారానికి పంపిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ పెద్దమ్మ నాగిని నియోజకవర్గంలో ఉంటూ... కార్యకర్తలతో కలసి తిరుగుతున్నారు. జాతీయ కాంగ్రెస్, బహుజన సమాజ్‌వాదీ, జాతీయ జనసేన, స్వతంత్ర అభ్యర్థులు ఇలా అనేక మంది బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా అన్ని నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం, వైసీపీల మధ్యే పోటీ ఉంది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించకముందు నుంచి సుడిగాలి ప్రచారానికి తెరలేపారు. పోలింగ్‌కు మరో 13 రోజులే సమయం ఉంది. ఇందులో ప్రచారానికి పది రోజులే మిగిలింది. ఇంత తక్కువ సమయంలో ఎక్కువ మందిని కలవడం కుదరదు. కుటుంబ సభ్యులంతా ప్రచారం చేయడం వల్ల వృద్ధులు, మహిళలు, యువత ఓట్లను కొల్లగొట్టడానికి ఆస్కారం ఉంటుందని అభ్యర్థులు భావిస్తున్నారు. అందుకే ఇంటిల్లిపాదీ ప్రచారంలో పాల్గొంటున్నారు. విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పెద్దమ్మ శ్రీనాగిని ఎస్.కోటలో ఉంటే.. చిన్నమ్మ శ్రీవాణి విశాఖపట్టణంలో వయోభారాన్ని లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు అభ్యర్థుల పిల్లలు సాంకేతికంగానూ సహకారం అందిస్తున్నారు. అసంతృప్తులను బుజ్జగించే బాధ్యత తీసుకుంటున్నారు. తద్వారా వారు కూడా ప్రచారంలో భాగస్వాములయ్యేలా జాగ్రత్త పడుతున్నారు.





కానరాని నోట్ల దండలు

(రాజాం రూరల్)

గతానికి భిన్నంగా ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికలలో పోటీ చేయాలంటే డబ్బే ప్రధానం. గతంలో నిజాయితీపరులు, స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నికలలో నిలిస్తే.. ప్రజలే వారికి నోట్ల కట్టల దండలు వేసేవారు. అది అభినందనే కాదు... ఒకవిధంగా ఆర్థిక సాయం కూడా. ఇది అభ్యర్థులకు గౌరవంగానూ... అదే సమయంలో ప్రజలలో తనపట్ల ఎలాంటి అభిప్రాయం ఉండేదో తెలియజేసేది. నాయకుల్లో సేవాతత్పరత ఉండేది. నాటి రోజుల్లో మద్యం ప్రభావం అంతంతమాత్రంగానే ఉండేది. మద్యం తాగే వారు గ్రామంలో ఒకరో, ఇద్దరో ఉండేవారు. ప్రస్తుతం తాగని వారి సంఖ్య ఆవిధంగా ఉందన్నా ఆశ్చర్యమే. గతంలో నాయకులకు, ఓటర్లకు నైతిక విలువలు ఉండేవి. ప్రస్తుతం డబ్బు విపరీతంగా ఖర్చుచేసి.. ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులిస్తూ కొంతమంది నాయకులు గెలుస్తున్నారు. ఓటర్లు సైతం నిజాయతీకి మంగళం పాడి ఏ పార్టీ అభ్యర్థి ఇచ్చినా తీసుకుంటూ తమకు నచ్చిన వారికి ఓటేస్తున్నారు. విపరీతంగా డబ్బు ఖర్చు చేసి గెలిచాక తిరిగి దానిని కూడబెట్టుకునే పనిలో నాయకులు నిమగ్నమై... అభివృద్ధికి మంగళం పాడుతున్నారు. ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారు. డబ్బు తీసుకుని ఓటేసిన ఓటర్లు సైతం నాయకుడిని ప్రశ్నించలేక... గ్రామాలకు వచ్చినపుడు సమస్యలపై నిలదీయలేక మౌనం వహిస్తున్నారు. ఫలితంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఆనాటి నోట్ల దండలు... నాటి నిస్వార్థ నాయకులు మళ్లీ కనిపించాలి.



ఎన్నికల సిబ్బందికి ఇచ్చేది అంతంతే!

● ఐదేళ్ల క్రితం ఇచ్చిందే.. ఇప్పుడు కూడా ● పెంచాలని కోరుతున్న ఉద్యోగులు

(గరుగుబిల్లి)


ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బందికి గత ఎన్నికలకు చెల్లించిన నామమాత్రపు రెమ్యునరేషన్ ఇప్పుడు కూడా చెల్లించనున్నారు. 2019 సాధారణ ఎన్నికలకు నియమితులైన అధికారులు, సిబ్బందికి చెల్లించాల్సిన రెమ్యునరేషన్ మొత్తాన్నే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల విధులకు నియమితులైన వారికి చెల్లించనున్నారు. అంటే ఐదేళ్ల క్రితం చెల్లించిన మొత్తమే ప్రస్తుతం కూడా చెల్లిస్తారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ గత నెల 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధులకు సెక్టార్ ఆఫీసర్లు కాకుండా అదనంగా నియమితులయ్యే జోనల్ మేజిస్ట్రేట్‌కు ఏక మొత్తంగా రూ.1500 చెల్లిస్తారు.

ఉద్యోగులు పెదవి విరుపు

[illegible] ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం వెళ్లి విధులు [illegible] రావాలంటే కనీసం రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. ఎంఈవోలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, బ్యాంకు మేనేజర్లను పీవో, ఏపీవోలుగా నియమించారు. సిబ్బంది రెమ్యూనరేషన్ విషయంలో ఎన్నికల కమిషన్ పునరాలోచించి రెమ్యునరేషన్ పెంచుతూ తాజా ఉత్తర్వులు సవరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఇలా చెల్లిస్తారు..

[illegible]



ఈ ఓట్ల కథ తెలుసా?



(సాలూరు రూరల్)

ఓటు వజ్రాయుధం. ప్రజాస్వామ్య మనుగడను శాసించేది ఓటు. భారత ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కుల, మత, లింగ బేధం లేకుండా ఓటు హక్కును కల్పించింది. ఈ ఓటును వివిధ రకాలుగా ఎన్నికల్లో వేసి తమకు నచ్చిన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారు. ఒక్కో ఓటుకు ఒక్కో ప్రత్యేకత ఉంది.

సాధారణ ఓటు

18 ఏళ్లు నిండిన భారత పౌరుడు ఓటును కలిగి ఉంటాడు. ఫారం-6ను పూర్తి చేసి ఆధార్, రేషన్ కార్డు, నివాస ధ్రువపత్రాలు చూపిస్తే ఓటు హక్కు లభిస్తుంది. దీనిని సాధారణ ఓటు అంటారు. సాధారణ ఓటు పోలింగ్ రోజున ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి వేస్తారు. అత్యధికులు ఇదే పద్ధతిలో ఓటు వినియోగించుకుంటారు.

పోస్టల్ బ్యాలెట్

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు సాధారణ ఓటర్లయి ఉంటారు. వారిని ఎన్నికల విధులకు నియమిస్తే పోలింగ్ రోజు తమ ప్రాంతంలో ఓటు వేసే అవకాశం ఉండదు. అందువల్ల వారు ముందస్తుగానే ఫారం-12 నింపి తమ ఎన్నికల ఆదేశాలు, ఆధార్ జిరాక్స్‌లతో కలిపి తాము పనిచేసే చోట ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేస్తారు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు అందిస్తారు. గతంలో పోస్టు ద్వారా పంపించే వారు. ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగానికి నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

- పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల్లోగా తమకు తీరిక ఉన్న సమయంలో వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది. గెలుపోటములను పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పలుసార్లు ప్రభావితం చేశాయి.

ఎన్ఆర్ఐకి ఓటు

విదేశాల్లో ఉన్న నాన్ రెసిడెంట్ ఇండియన్స్‌కు ఓటు హక్కును కల్పించారు. ఆన్‌లైన్‌లో ఫారం-6ను నింపి.. తగిన ఆధారాలు చూపిస్తే ఎన్ఆర్ఐలకు ఓటుహక్కు కల్పిస్తారు. తమ ఆసక్తి మేరకు విదేశాల నుంచి పోలింగ్ రోజున వచ్చి ఓటు వేయవచ్చు.

టెండర్ ఓటు

ఇది ప్రత్యేకమైన ఓటు. ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి ఓటు అప్పటికే ఎవరో వేసి ఉంటే ఈ ఓటును నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ ఆఫీసర్ జారీ చేస్తారు. తాను రాకుండానే ఎవరో ఓటు వేశారని నిరూపించుకోవాలి. దీంతో పీవో టెండర్ ఓటును ఇస్తారు. టెండర్ ఓటు ఈవీఎంలో వేయడానికి వీలులేదు. బ్యాలెట్ అందిస్తారు. బ్యాలెట్‌లో ఓటు వేసిన తరువాత పీవోకు అందించాల్సి ఉంటుంది. దానిపై పీవో సంతకం చేస్తారు. దానిని ఫారం 17 (బి), 17 (సీ)లో నమోదు చేస్తారు. దానిని ప్రత్యేకమైన కవర్‌లో పెట్టి సీల్ చేస్తారు. లెక్కింపులో పరిస్థితిని బట్టి దానిని పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రాక్సీ ఓటు ఫర్ సీఎస్‌వీ

దేశభద్రత విధుల్లో ఉన్న సైనికుల కోసం ప్రత్యేకంగా ప్రాక్సీ ఓటు విధానం ఏర్పాటు చేశారు. సైన్యంలో విధులు నిర్వహించే వారు ఓటు వేయడానికి రాలేని పరిస్థితి ఉంటుంది. అందువల్ల వా రికి క్లాసిఫైడ్ సర్వీస్ ఓటు అందిస్తారు. వారి తరపున సీఎస్‌వీ అనుమతి పొం దిన వ్యక్తి వచ్చి పోలింగ్ బూత్‌లో ఓటు వేయవచ్చు. అలా క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరు తరపున ఓటు వేయడానికి వచ్చిన వారిని ప్రాక్సీ ఓటరు అని... అతని ఓటును ప్రాక్సీ ఓటు అని అంటారు.

చాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని అతను నిజమైన ఓటరు కాదని పోలింగ్ ఏజెంట్ అభ్యంతరం చెప్పి చాలెంజ్ చేస్తారు. పోలింగ్ ఏజెంట్ వద్ద రూ.2 ఫీజు కట్టించుకుంటారు. పోలిం గ్ ఏజెంట్, వచ్చిన వ్యక్తి వాదనలు విన్న పీవో గుర్తింపు కోసం బీఎల్వో, ఇతర ఓటర్ల ద్వారా నిజమైన ఓటరా కాదా అని నిర్ధారించుకుంటారు. నిజమైన వ్యక్తి అయితే ఓటింగ్‌కు అనుమతిస్తారు. కాకుంటే పోలీసులకు అప్పగించి పోలింగ్ ఏజెంట్ కట్టిన ఫీజు అతనికి తిరిగిస్తారు. చాలెంజ్ ఓటు వేసిన వ్యక్తి వివరాలు ఫారం -14లో నమోదు చేస్తారు.

ఇంటి నుంచి ఓటు

85 ఏళ్లు దాటిన వృద్ధులకు.. దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. నిబంధనల మేరకు ఇళ్ల దగ్గర వీరంతా ఓటు వేయాల్సి ఉంటుంది.





చీపురుపల్లి పట్టణం

చీపురుపల్లిలో గెలిస్తే

అధికారమే!

● యాభై ఏళ్లుగా కొనసాగుతున్న సెంటిమెంట్



త్రిపురాన వెంకటరత్నం

(చీపురుపల్లి)

చీపురుపల్లి నియోజకవర్గం ఉత్తరాంధ్రలో హాట్ సీట్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం రెండు ప్రధాన పార్టీల నుంచి ఇద్దరు రాజకీయ ఉద్దండులు బొత్స సత్యనారాయణ, కిమిడి కళా వెంకటరావు తలపడుతున్నారు. ఈ నియోజవర్గ చరిత్రలో మరో ప్రధాన అంశం కూడా ఉంది. ఇక్కడ గెలుపొందిన పార్టీకి రాష్ట్రంలో అధికారం దక్కుతుందన్న విశ్వాసం కూడా బలంగా ఉంది. ఇది ఒట్టి మాట కాదని గతంలో వెల్లడైన ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. దీని కారణంగానే ప్రతిసారీ అసెంబ్లీ ఎన్నికలు మరింత ఆసక్తిగా మారుతుంటాయి.

గతంలో ఇలా...

- చీపురుపల్లి అసెంబ్లీకి 1972లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ నుంచి రౌతు పైడపునాయుడు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలోని 287 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 219 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- 1978లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ (ఐ) పార్టీ తరపున చిగిలపల్లి శ్యామలరావు గెలుపొందారు. 294 సీట్లకు గాను 175 స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ (ఐ) మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- 1983లో జరిగిన సాధారణ ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి త్రిపురాన వెంకటరత్నం తెలుగుదేశం పార్టీ తరపున గెలిచారు. రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించి 294కి గాను 202 స్థానాల్లో విజయ ఢంకా మోగించిన తెలుగుదేశం పార్టీ... ఎన్టీ రామారావు నేతృత్వంలో రాష్ట్రంలో అధికారం చేపట్టింది.
- 1985లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి కెంబూరి రామ్మోహనరావు గెలిచారు. అప్పుడు కూడా రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. ఎన్టీ రామారావు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.
- 1989లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి టంకాల సరస్వతమ్మ విజయం సాధించినప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఆ ఎన్నికల్లో 294కి 181 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీ మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సెంట్‌మెంట్‌కు చిన్న విరామమిచ్చింది.
- 1994లో తెలుగుదేశం పార్టీ తరపున గద్దే బాబూరావు గెలుపొందారు. రాష్ట్రంలో 216 సీట్లు సాధించిన ఎన్టీఆర్ సీఎం అయ్యారు.
- 1999లో కూడా దేశం పార్టీ తరపున గద్దే బాబూరావు రెండోసారి గెలిచారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటయ్యింది.
- 2004, 2009లో ఇక్కడ బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ తరపున గెలిచారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.
- 2014లో చీపురుపల్లి నుంచి కిమిడి మృణాళిని పోటీ చేసి, బొత్స సత్యనారాయణపై విజయం సాధించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి 117 సీట్లు లభించగా... నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.
- 2019లో ఇక్కడి నుంచి వైసీపీ నుంచి బొత్స పోటీ చేసి గెలుపొందారు. 151 సీట్లు కైవసం చేసుకున్న ఆ పార్టీ వైఎస్ జగన్‌మోహనరెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ విధంగా గడిచిన ఐదు దశాబ్దాలుగా చీపురుపల్లిలో గెలిచిన పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుండడంతో.. ఇక్కడ అభ్యర్థుల విజయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



కిమిడి మృణాళిని



కెంబూరి రామ్మోహనరావు



గద్దే బాబూరావు



బొత్స సత్యనారాయణ



చీపురుపల్లి రైల్వే స్టేషన్

ఈవీఎం బటన్ నొక్కి.. బీప్ శబ్దం గమనించాలి

● ఓటు దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు పాటించండి

(గరుగుబిల్లి)

ఓటర్లు పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కి..శబ్దాన్ని గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లు భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి... అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. రావడం లేదని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు ఉంటారు. మొదటి అధికారి మన వివరాలను పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో అధికారి ఓటరు సంతకం తీసుకుంటారు. మూడో అధికారి



ఓటరు చేతి వేలికి ఇంకు మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. అప్పుడు ఓటరు పరదా చాటునున్న ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినప్పుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీ ప్యాట్‌లో ఓటు వేసిన అభ్య ర్థి పేరు, పార్టీ వివరాలు కనిపిస్తాయి.. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. మూడో అధికారి ఈవీఎం మానిటర్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ చేయలేదని అర్థం చేసుకోవాలి. వెంటనే ప్రశ్నించాలి. ఇది కూడా రిగ్గింగ్‌లో ఒక భాగమే. వృద్ధులు, కొత్త ఓటర్లు ఇది గమనించకుండా పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోతారు. తరువాత బూత్‌లో ఉన్నవారు మన ఓటును దుర్వినియోగం చేస్తారు. వాళ్లకు నచ్చిన వారికి వేసుకుంటారు. ఓటు వేయడం మన హక్కు. దానిని జాగ్రత్తగా నిర్వర్తించాల్సిన బాధ్యత మనపై ఎంతగానో ఉంది. ఏమైనా తేడా గుర్తిస్తే మాక్‌పోల్ స్లిప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి.

స్థానిక సమస్యల సంగతేంటి?

- కొత్త హామీలు లేవు
- గత హామీల ప్రగతి ఏమిటో చెప్పలేదు
- మూతపడిన పరిశ్రమలు... కార్మికుల పరిస్థితి ఏమిటి?
- ఇదీ సీఎం 'సిద్ధం' సభ తీరు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/బొబ్బిలి

ముఖ్యమంత్రి హోదాలో.. అది కూడా ఎన్నికల ప్రచారం కోసం వస్తున్నారంటే స్థానికంగా అభివృద్ధి సాధించేందుకు ఏవైనా హామీలు ఇస్తారని సగటు ఓటరు ఆశించడం సహజం. కానీ బుధవారం సీఎం జగన్ చేపట్టిన సిద్ధం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో స్థానిక సమస్యల ప్రస్తావనే లేదు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు... పాదయాత్ర నాటి హామీలు... ముఖ్యమంత్రిగా ఇచ్చిన హామీలు... గత ఐదేళ్లలో అవి ఏ మేరకు నెరవేర్చారు? అనే ప్రస్తావనే లేదు. ఇదేదీ లేకుండా ప్రతిపక్షాలపై విరుచుకుపడేందుకే ఎక్కువ సమయం తీసుకున్నారు. ప్రతిపక్షాల పైన.. వారి ఎన్నికల హామీల పైన విమర్శలకే ఎక్కువ సమయం తీసుకున్నారు. వైసీపీ ప్రస్తుత ఎన్నికల హామీలు ఏమిటో ప్రస్తావించలేదు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రకటించారు. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కిన అంశాన్నే మరీ మరీ చెప్పారు. కానీ ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలు ఏమిటి? ఈ ప్రాంత అభివృద్ధికి స్థానికంగా ఉపయోగపడే వనరులు ఏమిటి? వాటిని ఎలా వినియోగించుకోవాలని అనుకుంటున్నారు? తాము చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి ఏమిటి? అన్న విషయాలను కనీసం ప్రస్తావించలేదు.



ప్రచారంలో సీఎం జగన్



పారాది వంతెన దుస్థితి

బిల్లులు చెల్లించక...

- బిల్లులు చెల్లించని కారణంగా విజయనగరం, మన్యం జిల్లాల పరిధిలో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. చినబోగిలి-మక్కువ, మక్కువ-సాలూరు రోడ్ల విస్తరణ పనులు బిల్లులు కాక నిలిచిపోయాయి. ప్రజల రాకపోకల కోసం నరకయాతన అనుభవిస్తున్నారు. సీతానగరం-బొబ్బిలి మధ్య ప్రవహిస్తున్న సువర్ణముఖి నది వంతెన పనులు కూడా బిల్లులు చెల్లించని కారణంగానే నిలిచిపోయాయి.
- తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పెండింగ్ పిల్ల కాల్వ పనులు నిలిచాయి.
- గజపతినగరం బ్రాంచి కాల్వ పనులను ప్రభుత్వం ఒక్క అడుగు కూడా పూర్తి చేయలేదు.



పరిశ్రమల ఊసేదీ?

బొబ్బిలి ప్రాంతంతో పాటు జిల్లాలో మూత పడిన ఫెర్రో పరిశ్రమల అంశాన్ని ప్రస్తావించలేదు. జూట్ పరిశ్రమల్లో పనిచేసి ఉపాధి కోల్పోయిన కార్మికుల ఊసే లేదు. కార్మిక దినోత్సవం రోజున కార్మిక సమస్యలను ప్రస్తావించకపోవటం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ విధానాల కారణంగానే పరిశ్రమలు మూతపడి... కార్మికులు ఉపాధి కోల్పోయారు. బొబ్బిలి ప్రాంతంలోని ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని మూత వేయించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. రైతుల చెరకు సరఫరా బకాయిల కోసం ఏకంగా కర్మాగారాన్నే మూత వేయించారు. బకాయిలు పూర్తిగా చెల్లించారా అంటే అదీ లేదు. కొంత మంది నాయకుల స్వార్థం కోసం ఫ్యాక్టరీ బలైందన్న విమర్శలున్నాయి. మరో వైపు రైతులు చెరకు పంటకు దూరమయ్యారు.

- తారకరామతీర్థ సాగర్ సాగునీటి ప్రాజెక్టు పనులు జరగటం లేదు. చిన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి పట్టించుకోని పరిస్థితి. తోటపల్లి కుడి ప్రధాన కాల్వ పరిధిలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే శంబంగి హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు. బొబ్బిలి మండలంలోని చిన్న సాగునీటి వనరులు... కురుపాం మండలంలోని గుమ్మిడి గెడ్డ, కొమరాడ మండలంలోని వనకాబడి గెడ్డ, పార్వతీపురం మండలంలోని అడారుగెడ్డ, మక్కువ మండలంలో సురాపాడు, సాలూరు, రామభద్రపురం, గజపతినగరం, నెల్లిమర్ల మండలాల పరిధిలోని చిన్న సాగునీటి వనరులను వినియోగించుకునే మినీ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టలేదు. సీఎం ప్రసంగంలో వీటి ప్రస్తావన కూడా లేదు.

ఆషామాషీ అభ్యర్థులకు అడ్డుకట్ట

(చీపురుపల్లి)

ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా పది మందిలో గుర్తింపు పొందాలని కొంతమంది కోరుకుంటారు. అసెంబ్లీకి పోటీ చేస్తే సుమారు నాలుగైదు మండలాల్లోనూ... పార్లమెంటుకు పోటీ చేస్తే ఆ పరిధిలోని దాదాపు 30 మండలాల్లోనూ గుర్తింపు తెచ్చుకోవచ్చునని చాలామంది అనుకుంటారు. ఈ లక్ష్యంతోనే డిపాజిట్ చెల్లించి పోటీకి సిద్ధపడతారు. అటువంటి ఆషామాషీ పోటీదారులను నిలువరించడం కోసమే కేంద్ర ప్రభుత్వం డిపాజిట్ మొత్తాన్ని లోక్‌సభకు రూ.25 వేలకు, అసెంబ్లీకి రూ.10 వేలకు పెంచింది. డిపాజిట్ మొత్తాల పెంపునకు సంబంధించిన ప్రజాప్రాతినిధ్య చట్ట (సవరణ) బిల్లు 2009కి పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీంతో ఈ సవరించిన మొత్తాలు అమలులోకి వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ మొత్తంలో యాభై శాతం చెల్లిస్తే సరిపోతుంది.



ప్రచారానికి వడదెబ్బ

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మే 1: ఇంట్లో ఏసీ.. బయటకు వెళితే కారులో ఏసీ.. ఇలా నిత్యం 'చల్లగా' ఉండే అభ్యర్థులు మండుటెండలో ఎన్నికల ప్రచారానికి వెళుతూ..చెమటలు కక్కుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందునుంచే జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వడగాల్పులు తీవ్రంగా ఉన్నాయి. నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి మరింత పెరిగాయి. ప్రచారంలో ముందుండాలనే ఉద్దేశంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో అభ్యర్థులు ఉదయం... సాయంత్రం ప్రచారం చేపట్టారు. రాను రాను సూర్యప్రతాపం ఎక్కువ కావటంతో కార్యకర్తలు ప్రచారానికి డుమ్మా కొడుతున్నారు. కొందరు అభ్యర్థులు... కార్యకర్తలు కూడా వడదెబ్బకు గురవుతున్నారు. ఎక్కువ సంఖ్యలో కార్యకర్తల మధ్య ప్రచారం చేయడం... హారతులు... పూలదండలు... నుదుటి తిలకం... ప్రచారంలో మంటలు పుట్టిస్తున్నాయి. కొంతమంది అభ్యర్థులు కార్యకర్తలు డీ-హైడ్రేషన్‌కు గురై.. సొమ్మసిల్లి పడిపోతున్న సందర్భాలు ఉంటున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక... కొందరు అభ్యర్థులు ఉదయం 9 గంటలకే ప్రచారం ముగించుకుని... తిరిగి సాయంత్రం 5 గంటల తరువాత మొదలు పెడుతున్నారు. మే నెలలో ఉష్ణోగ్రతలు మరీ తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయినా ఈ 10 రోజులు ఎలాగైనా వీలున్నంత వరకు ఎక్కువ మంది ఓటర్లను కలుసుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ కొద్ది రోజులైనా సూరీడు కాస్త శాంతిస్తే బాగుండునని కోరుకుంటున్నారు. బుధవారం బొబ్బిలిలో జరిగిన సీఎం ఎన్నికల ప్రచారంలో కూడా అనేక మంది కార్యకర్తలు ఎండవేడిని, వడగాల్పులను తట్టుకోలేక సొమ్మసిల్లిపోయారు.



ఎండకు తాళలేక షాపుల నీడకు చేరిన దృశ్యం



బొబ్బిలిలో సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలతో ఎండలోనే ప్రజలు

రావాడలో జీడి తోటలు దగ్ధం



రావాడ వద్ద కాలిపోతున్న జీడి తోటలు

జియ్యమ్మవలస: తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ గ్రామ సమీపంలో జీడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం ఉదయం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా ఒక్కసారిగా అగ్ని దావాణంలా వ్యాపించింది. ఈ ప్రమాదంలో చినమేరంగి గ్రామానికి చెందిన కౌలు రైతు మీసాల బుల్లిబాబుకు సంబంధించిన 2.10 ఎకరాల జీడి తోట పూర్తిగా కాలిపోగా, రావాడ గ్రామానికి చెందిన మర్రి పారమ్మ, దత్తి శ్రీనులకు చెందిన మరో రెండు ఎకరాలు జీడి తోటలు పాక్షికంగా కాలిపోయాయి. వెంటనే స్పందించిన సర్పంచ్ సింగారపు రవణమ్మ వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రం నుంచి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలను అదుపు చేయగలిగారు. లేదంటే ఆ చుట్టు పక్కన ఉన్న వందలాది ఎకరాల జీడి, మామిడి తోటలు పూర్తిగా కాలిబూడిదయ్యేవి. దీంతో మిగిలిన జీడి మామిడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాలో మండుతున్న ఎండలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. పార్వతీపురంతో పాటు మిగిలిన 15 మండలాల్లో, సాలూరు పురపాలక సంఘం, పాలకొండ నగర పంచాయతీలో ప్రజలు బుధవారం సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రత వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. అదేవిధంగా సాలూరు, పాలకొండ ప్రాంతాల్లో సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర కార్మికులు ఎండల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌వో



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన కె.విజయపార్వతి కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా విధులు నిర్వహించిన బగాది జగన్నాథరావు మంగళవారం పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన విజయపార్వతి.. ప్రస్తుతం సీతంపేట డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకుడు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఎన్నికల కమిషన్ నియమించిన అరకు పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు కె.వివేకానందన్ బుధవారం పార్వతీపురం విచ్చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో ఎన్నికల ఏర్పాట్లుపై చర్చించారు. ఈసందర్భంగా జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ పూర్తి, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను కలెక్టర్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో దశ ఈవీఎంలు రేండమైజేషన్ ప్రక్రియ పూర్తి, ఉద్యాన కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లు, తదితర అంశాలపై పరిశీలకులకు వివరించారు.

ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల శిక్షణ

సీతంపేట: నియోజకవర్గ పరిధిలో ఉన్న ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరం, బాలికల గురుకుల పాఠశాలలో పోలింగ్ విధులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి మాస్టర్ ట్రైనీలు ఈవీఎం యంత్రాల పనితీరు, మాక్‌పోలింగ్ చేసే విధానం, నివేదికలు సమర్పించే వివిధ ఫారాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారులు అడిగినా వివిధ సందేహాలను మాస్టర్ ట్రైనీలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

దేశంలోనే గొప్ప మేనిఫెస్టో

సీతంపేట: దేశ చరిత్రలోనే అన్ని వర్గాలకు సమతుల్యంగా అభివృద్ధి కల్పించడానికి ఏర్పాటు చేసిన కూటమి మేనిఫెస్టో దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి స్పష్టం చేశారు. బుధవారం సీతంపేటలోని తన కార్యాలయంలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టో ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి మేళవించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పునరంకితమవుదాం

గరుగుబిల్లి: ప్రజా సేవకు పునరంకితం అవుదామని జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు, ముఖ్య సలహాదారుడు డా.డి.పారినాయుడు అన్నారు. బుధవారం తోటపల్లిలో జట్టు ట్రస్ట్ కార్యాలయంలో జట్టు సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, రైతులు, నిరుపేదల ఆర్థిక స్వాలంబన కోసం జట్టు ట్రస్టు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజు, ప్రముఖ రచయిత, చిత్రకారుడు తుంబలి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పాలకొండ: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పిల్లలతో వేసవి వినోదం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు వేసవి విజ్ఞానం కోసం పుస్తకాలు చదివించడం, పాటలు, ఆటలు, కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, పాఠకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పునశ్చరణ తరగతులు



పునశ్చరణ తరగతులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

పాలకొండ: అడ్వాన్స్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ వి.హర గోపాల్ ఈ తరగతులు జరుగుతున్న తీరును బుధవారం పర్యవేక్షించారు. ప్రతి విద్యార్థి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా అధ్యాపకులు వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కనస్ట్రక్షన్ టెక్నాలజీ, ఒకేషనల్ గ్రూప్ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి నాలుగో తేదీ వరకు జరుగుతున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఓటు హక్కుపై ప్రచారం

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల్లో యువతీ యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటు వేయడం మన హక్కు అనే ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సంబంధిత బీఎల్వోలు, వీఆర్వోలు, అధికారులు ఈనెల 13న జరగను న్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో విధిగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రచారం నిర్వహిస్తున్నారు.

సమాజసేవలో తరించాలి

పార్వతీపురంటౌన్: సమాజ సేవలో ప్రతిఒక్కరూ తరించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా.మంచిపల్లి శ్రీరాములు అన్నారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో జిల్లెలమూడి అమ్మ సేవా సమితి పేదలకు అన్న సంతర్పణ ప్రారంభించి వెయ్యి రోజులు పూర్తి చేసు కున్న సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి, వైద్యుడు వెంకటరా వు, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం: జగదీశ్వరి



ప్రచారం చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడారు. దేశంలో పలు సర్వేలు అందించిన నివేదికల ప్రకారం 150 పైగా సీట్లతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. కురుపాంలో ఉన్న తోటపల్లి రిజర్వాయర్ అభివృద్ధిపై మ్యానిఫెస్టోలో పెట్టడం చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు నియోజకవర్గంపై ఉన్న మమకారం అర్థమవుతుందన్నారు. ● ఇరిడి పంచాయతీలోని గాజులగూడ, జొల్లగూడ, కొత్తగూడ, కనయ్యగూడ, కోసిగిభద్ర, టెంకసింగి, గుణద, డోకులగూడలో ఆమె ప్రచారం చేశారు. ప్రచారంలో కూటమి నాయకులు బిడ్డిక పద్మావతి, పాడి సుదర్శనరా వు, కె.మల్లేశ్వరరావు, మండంగి భూషణరావు, చంద్రమౌళి, గుణాపురం జగన్నాథం, లక్ష్మణరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● మండలంలోని ఇరిడి, దుమ్మంగి తదితర పంచాయతీల్లో కూటమి అభ్యర్థి జగదీశ్వరి బుధవారం ప్రచారం నిర్వహించారు. కూటమి అధినేతలు నరేంద్రమోడీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

● **గరుగుబిల్లి:** టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు తన స్వగ్రామమైన నాగూరులో బుధవారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు ఎం.పురుషోత్తంనాయుడు, మరడాన తవిటినాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, అంబటి తవిటినాయుడు, ఎంబీ విజయ వాంకుశం, తదితరులు పాల్గొన్నారు. ● **కురుపాం:** కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ జి.శివడ పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు కోలా రంజిత్‌కుమార్, జీవీ రమణమూర్తి, చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● **కొమరాడ:** మండలంలో గుణదతీలేసు పంచాయతీ లాబేసు గ్రామానికి చెందిన పది కుటుంబాలు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీ మండల కన్వీనర్ ఎస్.ఉదయశేఖర్‌పాత్రుడు వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి హిమరిక బలరాం, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ పర్యటనను విజయవంతం చేయాలి

● కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ



మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గురువారం చేపట్టనున్న పాలకొండ పర్యటనను విజయవంతం చేయాలని కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, జనసేన పరిశీలకులు వంపూరు గంగులయ్య, పాలవలస యశస్వి కోరారు. ఈమేరకు హెలీప్యాడ్ స్థలాన్ని, పట్టణంలోని స్టేట్‌బ్యాంకు దరిలో జరగనున్న సభా ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పవన్ పర్యటనను కూటమి నాయకులు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, జనసేన పరిశీలకులు కొరికాన రవికుమార్, టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, గంటా సంతోష్ కుమార్, ఉదయాన ఉదయ్‌భాస్కర్, సుంకరి అనీల్‌దత్, అంపోలు శ్రీనివాసరావు, గార శ్రీధర్ పాల్గొన్నారు. ● జనసేన విజయానికి ప్రజలు సహకరించాలని ప్రముఖ వైద్యుడు, జనసేన నాయకుడు దానేటి శ్రీధర్, ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ కోరారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో వారు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. శ్రీధర్ మాట్లాడుతూ కూటమి మ్యానిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జయకృష్ణ మాట్లాడుతూ తనకు సైకిల్‌పై గుర్తుపై, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ● నియోజకవర్గంలో జనసేన గెలుపే లక్ష్యంగా అంతా కలిసి పనిచేయాలని జనసేన నియోజకవర్గ పరిశీలకుడు కొరికాన రవికుమార్ పిలుపునిచ్చారు. పాలకొండలో బుధవారం నిర్వహించిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలవలస లీలాప్రసాద్, వావిలపల్లి రాజారావు, జాడ శ్రీధర్ పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణను గెలిపించాలని కోరుతూ మేజర్ పంచాయతీ పరిధిలో కూటమి నాయకులు బుధవారం ప్రచారం చేశారు. ● పాలకొండ మండల కేంద్రంలో గురువారం జరగబోవు పవన్‌కళ్యాణ్ ర్యాలీని, బహిరంగ సభను మండలంలోని కూటమి కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ కోరారు.

చంద్రబాబు సీఎం కావడం అవసరం

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



పార్టీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర అన్నారు. బుధవారం పార్వతీపురం పట్టణంలో 29వ వార్డుకు చెందిన అనేక మంది వైసీపీ కార్యకర్తలు తమ కుటుంబాలతో టీడీపీలో చేరారు. వీరందరికీ విజయచంద్ర పార్టీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే నిరుద్యోగ యువత కోసం డీఎస్సీ నిర్వహణపై తొలి సంతకం చేస్తారని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించడం, విద్యుత్ ధరలు పెరగకుండా చూడడం, మహిళకు ఉచిత బస్సు సదుపాయం, 50ఏళ్లు నిండిన బీసీలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలిసి పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొద్దు పైడిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు అభినందన

పార్వతీపురం రూరల్: మేడే సందర్భంగా పలువురు కార్మికులను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అభినందించారు. కార్మికులు అందరూ ఐక్యంగా ఉంటూ తమ కుటుంబ సభ్యులతో ఎల్లప్పుడూ ఆనందగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బార్నాల సీతారాం, బడే గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవం

● వాడవాడలా అరుణ పతాకం ఆవిష్కరణ
● ర్యాలీలు నిర్వహించిన వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు



పాలకొండ: కార్మికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గ పోరాటాల ప్రాధాన్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎం.కాంతారావు, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** మండల కేంద్రంలో మున్సిపాల్ కార్యాలయం ఎదురుగా రైస్‌మిల్లు జంక్షన్, మండలంలోని గొట్టమంగళాపురం, తంపటాపల్లి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆటోస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్మికవర్గ పోరాటాల్లో అమరులైన వారికి నివాళులు అర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం మామిడిపల్లిలో ముంగారమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ● **పాచిపెంట:** పాచిపెంటలో బుధవారం కార్మిక దినోత్సవం నిర్వహించారు. సీపీఎం మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు జెండా ఆవిష్కరించారు. గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మంచాల శ్రీనివాసరావు, రైతు సంఘ జిల్లా కమిటీ సభ్యుడు బోను గౌరినాయుడు, శ్రామిక మహిళా నాయకురాలు కె.పార్వతిదేవి పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** మేడే సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ● **మక్కువ:** మక్కువలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాసీలు ర్యాలీ చేశారు. అనంతరం ఎర్రజెండాను ఆవిష్కరించారు. మండల కలాసీల సంఘ సీనియర్ నాయకుడు ఆలమూరు అప్పారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు గోపాలం, వడ్డి సూరిబాబు, బైరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: అరుణ పతాకానికి సెల్యూట్ చేస్తున్న దృశ్యం



మక్కువ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

● ఆర్వో సూర్యకళ



పీవోలకు సూచనలు చేస్తున్న ఆర్వో సూర్యకళ

గజపతినగరం: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్వో ఎంవీ సూర్యకళ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలను ఏవిధంగా వినియోగించుకోవాలో సూచించారు. బ్యాలెట్ పత్రాలు, వాటి నమూనాలు, వరుస క్రమంగా అభ్యర్థుల పేర్లు ఏవిధంగా ఉండాలి అనే అంశాలపై శిక్షణ అందజేశారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం నుంచి నిబంధనలు మరింత కఠినతరంగా ఉంటాయని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్‌రూంతో పాటు పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటర్ బుక్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

గంట్యాడ: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, దీనిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని విజయనగరం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు హనీస్ చాబ్రా పిలుపునిచ్చారు. మండలంలోని తాటిపూడి రిజర్వాయర్ ఆవలగల డీకే పర్తి గిరిజన గ్రామంలో ఆయన బుధవారం పర్యటిం చారు. అక్కడ గిరిజనులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలిం చారు. ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలని అనేదానిపై సూచించారు. శతశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గిరిజనులకు ఓటర్ బుక్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరో పరిశీలకుడు సచ్చింద్ర పాటిల్, లైజింగ్ అధికారి వ్యవసాయ శాఖ జేడీ రామారావు, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** ఈనెల 13వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతిఒక్క ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డెంకాడ మండల హెచ్‌డీటీ కె.సూర్యకాంతం సూచించారు. బుధవారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో స్వీప్ ప్రచార కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీధి నాటిక, బుర్రకథల ప్రదర్శన ఏర్పాటుచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం పోరాం గ్రామానికి చెందిన కోరుకొండ రాము(49) గత నెల 28న రాజాం నుంచి పాలకొండ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతని ముందు వెళ్తున్న ట్రాక్టర్ రాజాం మండలం గురువాం గ్రామ సమీపంలో ఒక్కసారిగా ఆగడంతో ట్రాక్టర్‌ను బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రాము తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు రాజాంలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ వివరించారు. మృతుడి భార్య మగతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

భామిని: మండలంలోని నీటిఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ తోట శాంతికుమారి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఎన్నికల కోడ్ ఉండడంతో ఎటువంటి శాఖల వారీగా చర్చ జరగలేదు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ నీటి ఎద్దడి లేకుండా బోర్లు మరమ్మతులు చేయాలని, సర్పంచ్‌లు దీనిపై దృష్టి సారించాలని కోరారు. అలాగే ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ఉపాధి హామీలో వేతనదారుల కు వడదెబ్బ తగలకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కృష్ణారావుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

రాజాం: రాజాం ఎస్ఈబీ అధికారులు బుధవారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 134 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీధర్ తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో 53 మద్యం సీసాలు, వీఆర్ అగ్రహారంలో 30 సీసాలు, కంచరాం గ్రామంలో 51 సీసాలు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో మాటుకాసి వారిని పట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాసురెడ్డి, చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

రేపు రాహుల్‌గాంధీ రాయగడ పర్యటన

ఒడిశా

రాయగడ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ శుక్రవారం రాయగడ రానున్నారని ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా తెలిపారు. ఈమేరకు బుధ వారం స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరా లు వెల్లడించారు. స్థానిక ఐఎసీఆర్ కళాశాల సమీపంలోని మైదానంలో భారీ బహిరంగ సభ జరగనుందని, అంతకు ముందు ర్యాలీ ఉంటుందని, అందుకోసం ఓ ప్రత్యేక వాహనం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సభలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పాల్గొంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణా, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో 6 గ్యారంటీలను అమలు చేస్తోందని, ఈ గ్యారంటీలను ఒడిశాలో అమలు చేసేందుకు సభలో రాహుల్‌గాంధీ ప్రకటిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ వాహనాన్ని ఏఐ సీసీ కార్యదర్శి, జాతీయ సమన్వయకర్త రవీంద్ర దాల్వీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఒడిశా ఇన్‌చార్జి షహన్‌వాజ్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా, ఉపాధ్యక్షుడు సంకర్షణ మంగరాజ్, రాయగడ శాసనసభ అభ్యర్థి అప్పలస్వామి కడ్రక పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

రాయగడ: రైల్వే కాలనీలోని షిర్డీసాయి మందిర ప్రాంగణంలో కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం పలువురు అసంఘటిత కార్మికులకు లేడీస్ వాకర్స్ క్లబ్ సభ్యులు దుస్తులు, రొట్టెలు, బిస్కట్లు పంచి పెట్టారు. క్లబ్ అధ్యక్షురాలు కొరాడ రక్షిత, కార్యదర్శి కె.భారతి, కోశాధికారి బి.లక్ష్మి, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.